


అధిక వడ్డీ ఆశ చూపి రూ. 300 కోట్ల రూపాయలు వసూలు


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 02 డిసెంబరు , 2025 | పేజీలు : 06


# జాబితా విడుదల వరకూ అప్రమత్తం

## యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రస్తుతం జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ పూర్తయి తుది జాబితా విడతల వరకు అధికారులు అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మరోసారి స్పష్టం చేశారు. రెండవ దశలో జరుగు పోచంపల్లి మండల గ్రామాల స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పుడు సమాచారం లేకుండా చూసుకోవాలని అధికారులకు తగు సూచనలు చేశారు. జూలూరు క్లస్టర్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ వేస్తున్న అభ్యర్థుల పత్రాలను పరిశీలించి ఎలాంటి ఖాళీలు లేకుండా పూరించి పత్రాలను సమర్పించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల క్యాస్ట్ సర్టిఫికెట్ ధ్రువీకరణలో ఎలాంటి ఇబ్బందులు పెట్టకూడదని ఎమ్మార్వోకు సూచించారు. వెంటనే స్పందిస్తూ అన్ని సరి చూసుకొని క్లస్టర్ కేంద్రాల్లోని సర్టిఫైడ్ చేస్తామని చెప్పారు. అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థుల సిలబస్, రివిజన్ క్లాసులు, ప్రత్యేక క్లాసులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన పెద్దగూడెం ధాన్యపు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యాన్ని తరలించేందుకు రైతుల అభ్యర్థన మేరకు అదనపు లారీలను నడపాలని ఆదేశించారు. పోచంపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల సరళిపై ఆరా తీశారు. ఎన్నికల కోడ్‌ను ప్రతిష్టంగా అమలుపరచాలని ఎలాంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అన్ని శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు రివ్యూ మీటింగ్లో అధికారులకు సూచనలు చేస్తూ సుమృతవంతంగా ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం వరకు నామినేషన్లు దాఖలైన సంఖ్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గంటకు ఎంఆర్ఓ ప్రతి క్లస్టర్ కేంద్రాన్ని సందర్శించి పలు చేస్తారని తెలిపారు. రెండవ రోజు నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థులు నామినేషన్ వేయడానికి బారులు తీరారు. కాగా కొన్ని గ్రామాలలో ఇప్పటికే సర్పంచ్ వార్డుల అభ్యర్థులుగా దాఖలు చేసిన వారు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తు రాజకీయంగా వేడిని పెంచేస్తున్నారు. తాహసిల్దారు శ్రీనివాస్ రెడ్డి గుత్తా వెంకట్ రెడ్డి రిటర్నింగ్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.



# కాంగ్రెస్, సిపిఐ ఉమ్మడి అభ్యర్థిగా సత్యనారాయణ

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మండలంలోని అల్యాలపురం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆదేశాలతో సారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, సిపిఐ ఉమ్మడి అభ్యర్థిగా పోతురాజు సత్యనారాయణను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈర్ల సీతారాంరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కోటి నారాయణ, రాధాకృష్ణ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంకర మిల్లు దుమ్ము ధూళితో విద్యార్థులు అవస్థలు

## కలుషితమౌతున్న ఆహారం, తాగునీరు

## విద్యార్థుల ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్న ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మండలంలోని చందనపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక విద్యార్థులు దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న కంకర మిల్లు ద్వారా కంకర డిస్క్ దుమ్ము వెదజల్లి విద్యార్థులు అనారోగ్య పాలవుతున్నారని పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా అధిక కంకర లోడుతో టిప్పర్లు పాఠశాల పక్కనే ఉన్న రోడ్డు వెంట వెళ్లడంతో విపరీతమైన దుమ్ము చెలరేగి విద్యార్థులు తినే ఆహారంలో కలిసి కలుషితమైతుందని ఉపాధ్యాయులు విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న సమయంలో కంకర డిస్క్ లోడుతో టిప్పర్లు ఓవర్ స్పీడ్ లో దూసుకెల్లడంతో ఆ డిస్క్ అంతా గాలిలో స్కూల్ పిల్లల మీద స్కూల్లో, పాఠశాలలో ఉన్న చెట్ల మీద, పడడంతో చెట్లని తెల్లగా మారిపోయి వాడిపోతున్నాయని అదేవిధంగా విద్యార్థులు పాఠశాలకు వస్తున్న క్రమంలో కూడా టిప్పర్లు స్పీడుగా దూసుకెళ్తున్నాయని దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇట్టి విషయాన్ని కంకర మిల్లు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లిన వారు ఏమాత్రం స్పందించడం లేదని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము లేవకుండా రోడ్ల మీద నీళ్లు చల్లి, కంకర టిప్పర్లు నెమ్మదిగా వెళ్లాలని కోరుతున్నారు. కంకర మిల్లు స్కూలుకు దగ్గరలో ఉండడంతో నిత్యం కంకర డిస్క్ దుమ్ముతో ఊపిరి పీల్చుకోలేక అనారోగ్య పాలై విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందని ఇప్పటికైనా మైనింగ్ అధికారులు స్పందించి కంకర మిల్లుకు సంబంధించిన దుమ్ము ధూళి రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా కంకర డిస్క్ తో వెళ్తున్న టిప్పర్ ట్రక్కు పైన త ర్బన్ కట్టుకొని వెళ్లాలని. దుమ్ము ధూళితో ముఖ్యంగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండుతున్న సందర్భంలో భోజన పదార్థాలు కలుషితమవుతున్నాయని ఆహారం భుజించిన విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను జిల్లా అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుల, విద్యార్థులు కోరుతున్నారు.

**పాఠశాలకు కంకర మిల్లు దుమ్ము రాకుండా చర్యలు తీసుకోవాలి**

**ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి**



చందనపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కంకర మిల్లు దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు కూతవేటు దూరంలో ఉన్న కంకర మిల్లు ద్వారా ప్రతినిత్యం దుమ్ము ధూళి చేరడంతో విద్యార్థులు దుమ్ముగాలిని పీల్చుకోవడంతో నానా అవస్థలు పడుతున్నారని అదేవిధంగా వారికి మధ్యాహ్న భోజనం వండుతున్న సందర్భంలో అందులో కూడా దుమ్ము చేరి ఆహారం కలుషితం తెలిపారు. దీంతోపాటు స్కూల్ పక్కన రోడ్డు ఉండడంతో కంకర డిస్క్ తో వేగంగా దూసుకెళ్తున్న టిప్పర్ల ద్వారా ఒక్కసారిగా దుమ్ము లేచి విద్యార్థుల మీద, పాఠశాల లో ఉన్న వాటర్ ట్యాంక్ లో పడి నీరంతా కలుషితం అవుతుందని, అదేవిధంగా పాఠశాల ఆవరణలో ఉన్న మొక్కలపైన కూడా దుమ్ము పడి ఎండిపోతున్నాయని అన్నారు. ఇట్టి విషయంపై కంకర మిల్లు నిర్వాహకులను దుమ్ము రాకుండా చర్యలు తీసుకోవాలని కోరగా వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## అభివృద్ధి చేస్తా ... ఆశీర్వదించండి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** నీర్నెముల గ్రామ సర్పంచ్ పదవికి బోయిని ఆనంద్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించి మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి, గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని అన్నారు. గ్రామ అభివృద్ధి ఇప్పటీ నామమాత్రంగా ఉందని, సర్పంచ్‌గా ఎన్నికైతే అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తానని తెలిపారు. తాగునీటి శుద్ధి, వీది దీపాల మరమ్మతులు, కాల్వల శుభ్రత, మహిళలు, యువత కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, రైతుల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యతలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నాగటి అంటయ్య, బండ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సర్నేనిగూడెం బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా వెంకటేశ్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని సర్నేనిగూడెం గ్రామ పంచాయతీ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నీల వెంకటేష్‌ను మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి, ఆయన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అభినందనలు తెలియచేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ నాయకులు సమిష్టిగా పని చేసి సర్పంచ్ అభ్యర్థితోపాటు వార్డు సభ్యులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన సూచించారు.

## మహాలక్ష్మమ్మ పండుగ

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మ పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహించే మహాలక్ష్మమ్మ పండుగ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుండి జిల్లాల నుండి భారీ ఎత్తున ప్రజలు పండుగలో పాల్గొని అనంతరం ఏర్పాటు చేసిన ప్రభలు, డ్యాన్సులను చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఒక చోట చేరుకొని పెద్ద ఎత్తున సంసృతిక కార్యక్రమాలను తిలకించి ఆనందంలో మునిగిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు మూడవ దశలో జరగనున్న నేపథ్యంలో గ్రామంలో రాజకీయ నాయకుల సందడి భారీ ఎత్తున కనిపించింది. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. గ్రామ పెద్ద మనుషులు ముత్యాల సర్వయ్య, ఏడుపుల గోవింద్, బొమ్ము శ్రీను, మల్లేష్, అంజయ్య, వెంకటయ్య ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మ పండుగ పెద్ద ఎత్తున నిర్వహించారు.



## మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండలంలో ఉపాధి హామీ పథకంలో మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమని అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి.సురేష్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సోమవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయం స్త్రీ మహిళా విభాగంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 202425 ఆర్థిక సం.నికి మండలంలో జరిగిన సుమారు రూ.4.00 కోట్ల పనులకు అంటే రూ.2.50 కోట్లు వేతనాలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన రూ.1.50 కోట్లు మెటీరియల్‌కు సంబంధించిన పూర్తి రికార్డులను గత పది రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు గ్రామ స్థాయిలో తనిఖీ చేసి పూర్తి నివేదికను ప్రజావేదికలో చర్చించడం జరిగిందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.భాస్కర్, ఏపీవో పి.వి.జి. కృష్ణమూర్తి, అంబుడ్స్మన్ వీరమల్లు, అసిస్టెంట్ మేనేజర్ ఆదిత్య వర్దన్, సీనియర్ క్యూసి ఫసియుద్దీన్, సోషల్ ఆడిట్ ఎస్టీఎం అంజా గౌడ్, ఎస్ ఆర్పీ నర్సయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు సి.హెచ్.కృష్ణయ్య, ఇమ్మడి మాధవి, ఉపాధిహామీ ఫీల్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిద్దాం గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములం అవుదాం అని మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య నాయకత్వంలో అర్హులైన ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ, అర్హులైన గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీగా తెలంగాణ రాష్ట్ర శాశ్వత అభివృద్ధి లక్ష్యంగా రైజింగ్ తెలంగాణ 2047 నినాదంతో ముందుకెళ్తున్న తెలంగాణ ప్రజా ప్రభుత్వంకు స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో అన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## ఘనంగా భగవద్గీత జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భగవద్గీత జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో దేవాలయాలు ధార్మిక సంస్థల ఐక్యవేధిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భగవద్గీతలోని మొత్తం 18 అధ్యాయాలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. ఐక్యవేదిక కోకన్వీనర్ నాగవెల్లి ప్రభాకర్ మాట్లాడుతూ భగవద్గీత మత గ్రంథం కాదని సర్వమానవాళిని ఉద్ధరించే అపూర్వ వ్యక్తిత్వ వికాస గ్రంథం అన్నారు. గీతాజయంతి సందర్భంగా సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం పట్టణంలోని పలు దేవాలయాలలో వందలాది మంది భక్తులతో పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమం ఈనెల 7న స్థానిక రవి మహల్‌లో వెయ్యి మంది భక్తులతో సామూహిక భగవద్గీత పారాయణం సహస్ర గళ గీతార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొరిశెట్టి రామ్మూర్తి, పర్వతం శ్రీధర్ కుమార్, కందగట్ల రామకృష్ణ, కమటాల వెంకటేశ్వర్లు, నామిరెడ్డి సత్తిరెడ్డి, భూపతి వెంకన్న, కుక్కడపు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని, రెండేండ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బాణావత్ కృష్ణనాయక్‌తోపాటు అతని అనుచరులు 200 మంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గ్రామ మాజీ సర్పంచ్ బాణావత్ లలితసక్రునాయక్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్ఎస్ హాయంలో రైతులు, ప్రజలందరు సంతోషంగా ఉన్నారని, ఎరువుల విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం ఎరువులు దొరకక రైతులు పొలం పనులు మానుకోని పీఏసీఎస్ కార్యాలయాల చుట్టు తిరిగి అలసిపోయారని అన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మట్టపల్లి సైదయ్యయాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## టివిఎస్ సేవలు చేరువకావాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా టివిఎస్ కంపెనీ వారి సేవలను అందించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మిసాయి టివిఎస్ షోరూమ్‌లో టివిఎస్ కంపెనీ వారి నూతన స్కూటర్ ఎన్‌టార్క్ 150సిసిలో రెండు మోడల్ స్కూటర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. టివిఎస్ కంపెనీ వారి వివిధ రకాల బైక్స్, స్కూటర్లు మంచి ప్రజాదరణ పొందాయన్నారు. వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించి వారి మన్ననలు పొందాలన్నారు. టివిఎస్ కంపెనీ టిఎం రవితేజ, లక్ష్మిసాయి టివిఎస్ షో రూమ్ నిర్వాహకులు కర్నాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ టివిఎస్ ఎన్‌టార్క్ స్కూటర్‌లో శక్తివంతమైన 1500 సిసి ఇంజన్, లేటెస్ట్ అధునాతన ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కక్కిరేణి చంద్రశేఖర్, ఎండి అంజద్‌అలి, బైరు శైలేందర్ గౌడ్, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఉచిత మెగా వైద్య శిబిరం భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 127వ ఉచిత మెగా వైద్య శిబిరం భువనగిరి పట్టణంలోని పహాడీ నగర్ శ్రీ ఆర్కే హాస్పిటల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మేకల రమేష్ హాజరయ్యారు. ఈ వైద్య శిబిరం నందు భువనగిరి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా బీపీ షుగర్, న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు శ్రీ ఆర్కే హాస్పిటల్ అధినేత జనరల్ పిజిషియన్ డాక్టర్ చావా రాజ్ కుమార్ ఎముకలు కీళ్ళ వ్యాధులు నిపుణులు డాక్టర్ రోనక్ దినేష్ సోనీ దంత వైద్య నిపుణులు డాక్టర్ చావా అశ్లేష హాస్పిటల్ ఇంచార్జ్ కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తదనంతరం సిఐ చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరం నందు 150 మదికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలియజేశారు.

## ఆరోగ్య భారతావనిని నిర్మిద్దాం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** హెచ్ఐవి రోగులు లేని ఆరోగ్య భారతావనిని నిర్మించి మంచి వాతావరణంలో ప్రతి ఒక్కరు జీవించాలని మండల వైద్య అధికారిని డాక్టర్ శ్రీవాణి పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోచంపల్లి డిసెంబర్ ఒకటి ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించి దానిని ఎలా నివారించుకోవాలో ఆమె సూచనలు చేశారు. హెచ్ఐవి వ్యాధి పట్ల విస్తృతంగా వాస్తవాలను తెలియజేయాలని అపోహలను తొలగించాలని హెచ్ఐవితో జీవిస్తున్న వారికి ఆత్మస్థైర్యం నింపుతూ అండగా నిలవాలని ప్రపంచవ్యాప్తంగా మెరుగైన పరీక్షలు, చికిత్స ప్రాప్యత కోసం ముందుకు సాగుదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అరుంధతి, ఫార్మసిస్ట్ ప్రదీప్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్ బాబు, జానకి పాల్గొన్నారు.



# విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షలో ప్రతిభ చాటిన కాకతీయ విద్యార్థి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థి విజ్ఞాన్ మంథన్ లెవల్1,2 పరీక్షల్లో పట్టణంలోని కాకతీయ పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్, ఛైర్మన్ గుండా హరినారాయణలు మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పున్న నితీష్ అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో ప్రతిభ చాటి విజయం సాధించాడని అన్నారు. వీవీఎం పరీక్ష 6వ తతరగి నుంచి 11వ తరగతుల విద్యార్థుల కోసం డిజిటల్‌గా నిర్వహించబడే జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష. ఇది ఎన్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర బోర్డు సైన్స్ పాఠ్యాంశాలు, సైన్స్‌కు భారతదేశం యొక్క సహకారాలపై దృష్టి సారించి, సైన్స్‌ను ప్రాచుర్యం పొందడం, శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించడం, యువ విద్యార్థుల్లో సైన్స్ గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. వీవీఎం పరీక్ష యువ శాస్త్రీయ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి అనేక అవార్డులు, బహుమతులు అందిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో తరగతికి 1,2,3వ ర్యాంకర్లకు రూ.25వేల నగదు బహుమతి, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకర్లకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతులు అందుతాయని అన్నారు. విజేతలకు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ శిబిరాలు వంటి వివిధ స్థాయిల్లో పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు కూడా అందుతాయన్నారు. అదనంగా జాతీయ స్థాయి విజేతలకు నెలకు రూ.2వేల చొప్పున ఒక సంవత్సరం పాటు భాస్కర స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు ఉన్నారు.



## జెవివి టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎస్‌పిఆర్ విద్యార్థులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని ఎస్‌పీఆర్ పాఠశాల విద్యార్థులైన రిత్విక్, సాయి సింధు, శ్రీహర్షిత్‌లు ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, నాదెండ్ల అయ్యన్న, యామిని వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యాబోధన విద్యార్థుల స్థాయిలను గుర్తించి బోధన చేస్తున్నట్లు తెలిపారు.

## రాజేశ్వరి నామినేషన్ దాఖలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని తక్కెళ్ల పాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన రాజేశ్వరి సోమవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె నామినేషన్ పత్రాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్లమోతు సిద్దార్ధతో కలిసి అధికారికి అందచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చౌగాని భిక్షంగౌడ్ ఉన్నారు.

## సర్పంచ్ అభ్యర్థి నామినేషన్‌కు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ తరుపున నామినేషన్ వేయడం జరిగింది. నామినేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ హాజరయ్యారు. ముందుగా రామాలయంలో పూజలు చేసి నామినేషన్ పత్రాలను తీసుకోని ర్యాలీగా బయలుదేరి తుంగపాడు గ్రామపంచాయతీ క్లస్టర్‌లో రిటర్నింగ్ అధికారి వీరయ్యకు నామినేషన్ సమర్పించారు.

## పోలీస్ కిష్టయ్య వర్థంతి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య ముదిరాజ్‌కు ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని అమర వీరుల స్తూపం వద్ద సోమవారం ఘనంగా నివాళులర్పించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంట నరసింహా, కుక్కదుగు సోమయ్య, కొలుపుల అమరేందర్, సాదు విజయ్, ఇట్టబోయిన గోపాల్ పాల్గొన్నారు.



# ఎయిడ్స్ రహిత సమాజ ఏర్పాటుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/నూతనకల్ :** ఎయిడ్స్ రహిత సమాజ ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ లిఖిత్ కోరారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ చరణ్ నాయక్, సూపర్ వైజర్ చిన్ని, శైలజ, అనూహ్య, ఉషారాణి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



### ప్రపంచ ఎయిడ్స్ డే ప్రత్యేక ర్యాలీ

**ప్రజాపక్షం/అర్వపల్లి :** అడ్డంకులను అధిగమిద్దాం ఎయిడ్స్ ప్రతిస్పందననీ మారుద్దాం అనే నినాదంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటుకునే వ్యాధికాదని అంటించుకునే వ్యాధి అన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, సూపర్ వైజర్ లలిత, నర్సింగ్ ఆఫీసర్లు సునీత మాధవి, చొక్కయ్య, అనూష, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా జూనియర్ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ కె.ఆర్.ఆర్ కళాశాల క్రీడామైదానంలో సోమవారం సూర్యాపేట జిల్లా జూనియర్ బాలికల జట్టును ఎంపిక చేసిన్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామ నరసింహారావు తెలిపారు. ఈనెల 2ను నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలో నిర్వహించు 51వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబాడీ పోటీలో ఈ జట్లు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తుందని, జట్టు కోచ్‌గా రమేష్‌బాబు వ్యవరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ శెట్టి రామచందర్‌రావు, మాతంగి బసవయ్య, టి.రమేష్, బసవయ్య పాల్గొన్నారు.





## బిఆర్‌ఎస్ నుండి టిడిపిలో చేరిక

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** కోదాడ మండలం దొరకుంట గ్రామంలో బిఆర్‌ఎస్ నుండి చౌడం వెంకట్రామయ్య ఆధ్వర్యంలో శీలం వెంకన్న, చాపల రాముడు, పత్తిపాక శ్రీనివాస్, పిట్టల సైదులుతోపాటు 50 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని కోదాడ తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జి ఓరుగంటి ప్రభాకర్ తెలుగుదేశం పార్టీ కండువాగప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు, ముంద్రా అప్పారావు, దొరకుంట గ్రామ శాఖ అధ్యక్షులు యాదయ్య, పిట్ల శోభన్ బాబు, ఉంద్రా నరేష్, పాపయ్య, గోవింద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్, వామపక్షాల పొత్తు

### సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ పొత్తుతో పోటీ చేస్తున్నారు. సర్పంచ్‌గా వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, 12 మంది వార్డు మెంబర్లు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి పుష్కల రవి, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్డీ మహబూబ్‌అలీ, వెంకటయ్య, గాయం రజిత, జొన్నలగడ్డ అరుంధతి, కనకంటి రామకృష్ణ, పాక మధు, గువ్వల నాగమణి, గువ్వల శేఖర్, చిమట అంజి, నక్క శ్రీను, మూసి పుల్లయ్య, మూసుకోల చిమట, సురేఖ, జటవేణి వెంకన్న, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, పుల్లమ్మ, నాగమణి, దేవకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఒ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** నల్గొండ జిల్లా డిఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడి సరైన సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకొని సంతృప్తి చెందారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫ్రై డే, డ్రై డేను నిర్వహించాలని, రోగులకు మందుల సరఫరాను సకాలంలో అందించాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. ఉషారాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌ఐ బిసి అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎన్‌ఆర్‌ఐ లండన్ లో గత 15 సంవత్సరాలుగా ఉన్నటువంటి నలగొండ పట్టణవాసి హనుమాన్ నగర్ కు చెందిన దూదిగామ కిరణ్ కుమార్ కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఎన్‌ఆర్‌ఐ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలో దూది కామ కిరణ్ కుమార్ ని బీసీ సంక్షేమం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నా వంతుగా విదేశాల్లో ఉన్నటువంటి ఎన్‌ఆర్‌ఐ లని వంద మందితో బీసీ ఉద్యమాన్ని ముందుకు నడపడం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు. అతి త్వరలో హైదరాబాదులో వంద మందితో మీటింగ్ ఏర్పాటు చేసి బీసీల చట్టసభల్లో రిజర్వేషన్లు వచ్చేంతవరకు కృషి చేస్తానన్నా రు. నలగొండ జిల్లా సంఘానికి కూడా నా వంతు ఉద్యమం ఉద్యమానికి ఊతమిస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుదుకు లక్ష్మీనారాయణ, బెస్త సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు వక్కతట్ల వెంకన్న యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శంకరయ్య, జిల్లా కార్యదర్శి వల్లకీర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.





## అయ్యప్పలకు అన్నదానం

**ప్రజాపక్షం/కోదాడ:** పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని పట్టణ ప్రముఖ న్యాయవాది, కాంగ్రేస్‌పార్టీ నాయకులు, బీ.సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గాలి శ్రీనివాస్‌నాయుడు తన సోదరుడు గాలి రమేష్ నాయుడు జ్ఞాపకార్థం మాలధారులక నిత్యన్నదానం నిర్వహిస్తున్నరు. సోమవారం దాతలు కారుమంచి శ్రీనివాస్, మహేంద్ర షోరూం మేనేజర్ రమణలు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీతరాంసింగ్, నాగరాజు, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** హనుమాన్ దీక్ష తీసుకున్న ఆంజనేయస్వాములకు సోమవారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రమౌళీశ్వర దేవాలయంలో అందుగుల ఏడుకొండలు ధనమ్మ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆంజనేయ స్వాములు ఆ పుణ్యదంపతులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో గుండెబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయ గురుస్వాములు బత్తుల పరమేష్, చంద్రమౌళి, స్వాములు బట్టు నరేష్, శివ, ఏర్పుల రవి, సత్యనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మయ్య మేస్త్రీ, అయ్యప్ప స్వాములు, శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## కుల ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి

**ప్రజాపక్షం/గుండాల;** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయు అభ్యర్థులకు సోమవారం స్ధానిక ఎంపిడిఒ చండీరాణి నామినేషన్‌కు సంబంధించిన పలు సూచనలు చేయడం జరిగింది. రిజర్వ్ స్ధానాల్లో పోటీ చేయు అభ్యర్థులు తప్పని సరిగా కుల ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని, అన్ రిజర్వ్ స్ధానాలలో పోటీ చేయు అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అన్ రిజర్వ్ స్ధానాల్లో పోటీ చేయు ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులు నామినేషన్ రుసుము మినహాయింపు పొందడానికి మాత్రం కులధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు కొత్త బ్యాంక్ అకౌంట్ తప్పని సరిగా సమర్పించాలని అన్నారు.

# నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ లక్ష్యం



**ప్రజాపక్షం/చండూరు మున్సిపాలిటీ :** ఏ ఆసరా లేని నిరుపేదలను ఆదుకోవడమే గాంధీజీ ఫౌండేషన్ యొక్క ఆశయం అని ఆ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. రెండు సంవత్సరముల వరకు ప్రతి నెల 30మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యవసర సరుకుల పంపిణీని చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ,గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు దంపతులు 2024 సంవత్సరం జనవరిలో గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన నిరుపేదలకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం 2025 డిసెంబర్ నాటి నిత్యవసర సరుకుల పంపిణీతో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల డైరక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ భార్గవ్, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, పాలకూరి కిరణ్ , ఆనంద్, నజీర్ ,వెంకటేశ్వర్లు, యాలాద్రి, కోటేష్ ,బోడ యాదయ్య, వెంకన్న , బోడ సాయిరాం, ప్రేమ్ కుమార్ ,యాదగిరి , ఆంజనేయులు ,లింగస్వామి పాల్గొన్నారు.

# అనాజిపురంలో బిఎస్‌పి, కాంగ్రెస్‌కి షాక్...



**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని బిఆర్‌ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ పేర్కొన్నారు. చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన బిఎస్పి మండల అధ్యక్షుడు ముదిగొండ మొగిలయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేసి బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సోమవారం దేవరకొండలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ ఎస్ పార్టీలో చేరిన వారికి మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ ఎస్ పార్టీతోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి సాధ్యమని, గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. అనంతరం అనాజీపురం గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ముదిగొండ అనిత మొగిలయ్యను జిల్లా అధ్యక్షులు రవీంద్రకుమార్ ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో అనిత, నాగరాజు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, అశోక్, సుధీర్, శ్రీకాంత్, విష్ణువర్ధన్, రవి, నర్సింహా, కృష్ణయ్య, లక్ష్మయ్య, దర్మారెడ్డి, సాయి, మధు, జంగయ్య, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు. ఈకార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్ తదతరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ గూడెం కిడ్నాప్ వ్యవహారం రాజకీయ డ్రామా



### ఈ వ్యవహారంలో మంత్రి కోమటిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తిప్పర్తి మండలం ఎల్లమ్మ గూడెంలో మామిడి యాదగిరి కిడ్నాప్ వ్యవహారం రాజకీయ డ్రామా అని ఇందులో మంత్రి కోమటిరెడ్డి కి ఎలాంటి సంబంధం లేదని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ వెల్లడించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గంలో వివిధ పదవులలో బీసీలకు పెద్దపీట వేసిన ఘనత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిదేనని అన్నారు.గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఎక్కడ జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు.గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థిని గ్రామాలలో మీరే అభ్యర్థిని ఎన్నుకొని గెలిపించుకోవాలని సూచించడం జరిగిందని తెలిపారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారే తప్ప ఇలాంటి చిల్లర పంచాయతీలో ఎన్నడు ఆయన చేసుకోరని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసిలు వంగూరు లక్ష్మయ్య, శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ బిసి సంఘాల నేతలు జూలకంటి శ్రీనివాస్, ప్రదీప్ నాయక్, జేరిపోతుల భాస్కర్, వజ్జ రమేష్ యాదవ్, అల్లి సుభాష్ యాదవ్, ఇటికాల శ్రీనివాస్, పిల్లి రమేష్ యాదవ్, గోగుల గణేష్ యాదవ్,గోవర్ధన్ గౌడ్, బొడ్డుపల్లి రాజేష్, బోనగిరి ప్రభాకర్, పాలకూరి శ్రీధర్, బోరిగం రంజిత్, మామిడి కార్తీక్ పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిసి వర్గానికి చెందిన మామిడి యాదయ్య తన భార్య మామిడి లక్ష్మమ్మను సర్పంచ్ పదవికి నామినేషన్ వేయటానికి వస్తున్న సందర్భంగా యాదయ్యను జిల్లా మంత్రి అనుచరుడు, మరికొంత మంది గుండాలు కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టారని ఆరోపిస్తూ జిల్లా బిసి జెఏసి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ అగ్రవర్ణ దురాహంకారంతో చేసిన సంఘటన యావత్ ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ చర్యలకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నారబోయిన వెంకట్ యాదవ్, డేవిడ్ కుమార్, మర్యాద సైదులు యాదవ్, దాసరి దేవయ్య మాల, బండ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## అవగాహనతో ఎయిడ్స్ నివారణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అవసర పరిస్థితులలో రక్తమార్పిడి ,సిరంజీలు పచ్చబొట్ల కు వాడే నిడిల్స్ విషయంలో సురక్షిత పద్ధతులను పాటిస్తూ విశృంఖల శృంగారాన్ని కి దూరంగా ఉండాలని కంటి వైద్యులు,సివిల్ సర్జన్ స్పెషలిస్ట్, నల్లగొండ ఐ ర్ సి ఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పుల్లారావు సూచించారు. సోమవారం పట్టణంలోని నాగార్జున ప్రభు త్వ కళాశాల అటానమస్, యన్ యస్ యస్ యూనిట్స్ జువాలజి డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ హెచ్ ఐవి,ఎయిడ్స్ పేషెంట్స్ ను దయతో చూడాలని మానవతా హృదయముతో మెలగాలని,అవగాహన తో ఎయిడ్స్ ను నివారించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, యమ్ వెంకట రెడ్డి,యన్ కోటయ్య, కె శివరాణి, డాక్టర్‌ఏ.మల్లేశం, డాక్టర్‌బి.అనిల్ కుమార్,యమ్ సావిత్రి, డాక్టర్‌వెల్దండి శ్రీధర్, జ్యోస్న బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్లగొండ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

**ప్రజాపక్షం /హాలియా:** డిసెంబర్ 2, 3 ,4 తేదీలలో నల్గొండ జిల్లా హాలియాలో జరిగే 51వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును నల్గొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. భూలోకరావు ,జి. కర్తయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు .జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఎస్ కే అయేషా అలీ నగర్, ఎన్. కీర్తి ఇబ్రహీంపేట, ఎండి. ఆఫ్ష, అలీ నగర్, వి .సాయి అభి జ్ఞ తిరుమలగిరి , టీ .హన్సిక తిరుమలగిరి , ఆర్ అభినయ శ్రీ కట్టంగూర్,సంతోషిని,నల్లగొండ, వి. లక్ష్మి పెద్దమునిగల్ , ఐ .చందన చెరుకుపల్లి, జి.అనుత్న హాలియా , వైష్ణవి మునుగోడు,ఏ .భవ్య శ్రీ మదారి గూడెం, సిహెచ్ . సంధ్య దామరచర్ల, ఎన్ .పావని ఇబ్రహీంపేట ,స్టాండ్ బై ఆటగాళ్లుగా ఆర్. వాగ్దేవి అనుములలు ఎంపికైనట్లు చెప్పారు,కోచ్ ఎండి.అన్వర్ ఖాన్,మేనేజర్ పరమేష్ లు వ్యవహరిస్తారని తెలిపారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/మునుగోడు :** యువత అన్ని రంగాలతో పాటు క్రీడల్లో రాణించాలని మునుగోడు ఎస్సై ఇరుగు రవి అన్నారు. మండల కేందర్రంలో సుమారు 50 మంది క్రికెట్ ఆడుతున్న యువకులకు స్పోర్ట్స్ జెర్సీలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ తో పాటు స్పోర్ట్స్ కూడ ప్రాధాన్యమని మీకు నచ్చిన క్రీడల్లో మీ యొక్క ప్రతిభను కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెరమళ్ళ ప్రణయ్ కుమార్, మునగాల రాజు, పాలకూరి సాయి, నకరికంటి వెంకన్న, బోడ రాజు , మేకల శరత్, దోమలపల్లి సతీష్, పెరమండ్ల రాము, మీనాజు, నితిన్, కొమ్ము సాయి, రవి బాలరాజు తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామానికి చెందిన పాలడుగు సాయి ఆర్థిక సమస్యలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మరణించాడు. సోమవారం పిఎస్ ఆర్ చారిటి చైర్మన్ పంగా సతీష్‌రెడ్డి సాయి పార్థివ దేహంపై పూల మాల వేసి, నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. పరామర్శించిన వారిలో వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, యాదగిరి, రాజు, ఎల్లేష్, నరేష్, రవి, దేవా, ఎల్లయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

## పోలీస్ కిష్టయ్య వర్ధంతి

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీసు కిష్టయ్య 16వ వర్ధంతి సందర్భంగా మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నాగారపు రమేష్ ఆధ్వర్యంలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం సభ్యులు పోతనబోయిన సత్యానారాయణ, మండల ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు యాట రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద స్థలంలో క్షతగాత్రులకు సహాయం



ప్రజాపక్షం/చివ్వెంల : సూర్యాపేట చివ్వెంల వెళ్ళే రహదారిపై గురుకుల పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సూర్యాపేటకు వెళ్తున్న బొలెరో వాహనం ఫల్టీకొట్టింది. ఇదే సమయంలో చివ్వెంల మండలం కేంద్రంలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించడానికి వెళ్తున్న జిల్లా ఎస్పి కె నరసింహ ప్రమాద స్థలం వద్ద ఆగి స్వయంగా ఆయనే రంగంలోకి దిగి బోల్తా పడిన బొలెరో వాహనంలో నుంచి క్షతగాత్రులను బయటకు తీసి వాహనాను సిబ్బందితో కలిసి వాహనాదారులకు ఇబ్బంది లేకుండా తొలగించారు. ఎస్పి స్వయంగా సహాయక చర్యలు చేసి క్షతగాత్రులను కాపాడడంతో క్షతగాత్రులు కృతజ్ఞతలు తెలుపగా, వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్నారైకి ఘన సన్మానం




ప్రజాపక్షం/హాలియా: హాలియా రామాలయంలో అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేసిన ఎన్నారై మాలే సతీష్ రెడ్డిని స్వాములు సన్మానించారు. సోమవారం హాలియాలోని రామాలయంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఎన్నారై సతీష్ రెడ్డిని హాలియా సీఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి, ఎస్ఐ బండి సాయి ప్రశాంత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డిలు శాలువాతో సన్మానించారు . ఈకార్యక్రమంలో గురుస్వామి మేడే పల్లి మోహన్ రావు,వర్కాల సుధాకర్ రెడ్డి,రిమ్మలపూడి రామకృష్ణ,ఆంజనేయులు,మంద నర్సిరెడ్డి, శ్రీనివాస రెడ్డి,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## బిసి అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలి

ప్రజాపక్షం/మోటకొండూర్ : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించాలని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల మల్లేష్ గౌడ్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాంచారిపేట కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా కల్లూరి సత్యనారాయణ గౌడ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందని, సత్యనారాయణ గౌడ్‌ను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## రిజర్వాయర్‌ను కమ్మేసిన పొగ మంచు



ప్రజాపక్షం/నందికొండ: సాగర్ రిజర్వాయర్ లో మంచు దుప్పటి కమ్మేసింది పొగ మంచు ఎక్కువగా కమ్ము కోవడంతో రిజర్వాయర్, ప్రాజెక్టు పూర్తిగా పొగ మంచులో కూరుకుపోయి ఏమాత్రం కనిపించకుండా పోయింది. దీనికి తోడు చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు.ఉదయ రోడ్లు మీద కూడా మొత్తం పొగ మంచు కమ్మేయడంతో రోడ్లు కనిపించక వాహనదారులకు ఇబ్బందులు పడ్డాడు. మంచు కురిసే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని ఈ సమయంలో వాహనాలకు లైట్లు వేసుకుని ప్రయాణించ వలసి వస్తుందని వాహన దారులు తెలుపుతున్నారు.కొద్ది రోజులుగా మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో చాలాసేపటి వరకు వెలుతురు మందగించే ఉంటుంది.

## రోడ్ల శాఖ మంత్రి ఇలాకాలో రోడ్డు ప్రమాదాలు



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదం స్థలాన్ని బిజెపి మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలకు ముందు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను అసంపూర్తిగా నిర్మించటం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి ఇటీవల కాలంలో పలువురు మరణించటం దురదృష్టకరం అన్నారు. ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో అభిరామ్ అనే యువకుడు మరణించారు ఇంకా ఎంతమంది యువకులు చనిపోతే అధికారులు నాయకులు కళ్ళు తెరుస్తారు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ నడింపల్లి శ్రవణ్ కుమార్,ఓబీసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్,నాయకులు నోముల నాగరాజు,బిళ్ళకంటి శ్రీకాంత్,సీనియర్ సిటిజన్ పాల్వాయి భాస్కర్ రావ్,వడ్డెగోని రామలింగం, ఏర్పుల పరమేష్,పాలకూర రమేష్,బొల్లెద్దు రామలింగం,తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల మహా ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాపక్షం/నందికొండ:జర్నలిస్టుల సమస్యలపై డిసెంబర్ 3న హైదరాబాదులోని సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు జర్నలిస్టులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజే నల్లగొండ జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త అక్రిడేషన్ కార్డులు, ఆరోగ్య బీమా, ఇంటి స్థలాలు తదితర సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన జర్నలిస్టుల సమస్యలు తీర్చలేదని అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. డిసెంబర్ 3వ తేదీన జరిగే మహా ధర్నాకు జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరూ తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో, పాకాల నరసింహ, ప్రకాష్, రవి,రాజు, అప్పారావు, శ్యామ్, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి దూదిమెట్ల

ప్రజాపక్షం/నార్కట్ పల్లి: కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లోకి మాజీ జెడ్పిటిసి సభ్యులు దూదిమెట్ల సత్తయ్య యాదవ్ ను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నుండి మేజర్ గ్రామపంచాయతీ నార్కెట్పల్లి సర్పంచ్ టికెట్ పై నిరాశ ఎదురు కావడంతో తన అనుచరులతో సోమవారం బిఆర్ఎస్ పార్టీలోకి చేరినట్లు సమాచారం.





## ర్యాకల సంతోష శ్రీనివాస్ నామినేషన్

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ర్యాకల సంతోష శ్రీనివాస్ అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి ఎన్నికల క్లస్టర్‌లో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ర్యాకల సంతోష శ్రీనివాస్‌లకు మద్దతు తెలుపుతూ తాజ్పూర్ గ్రామం నుండి అనంతారం ఎన్నికల క్లస్టర్ కార్యాలయం వరకు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోపురాజుపల్లి సర్పంచ్ అభ్యర్థిగా వీరస్వామి

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలం గోపురాజుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి సలిగంజి వీరాస్వామి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందచేశారు. ప్రజా సమస్యలే ద్యేయంగా పనిచేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సలిగంజి కృష్ణ కుమార్, దళిత సంఘాల నాయకులు సలిగంజి చంద్రయ్య, రామ్ మల్లయ్య, మచ్చగిరి, స్వామి పాల్గొన్నారు.






## ఎన్నికల కోడ్... అట్టహాసంగా మద్యం దుకాణాలు

ప్రజాపక్షం/నార్కట్ పల్లి: తెలంగాణ ప్రభుత్వం మద్యం దుకాణాలకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో లక్కీ డ్రా ద్వారా దక్కించుకున్న మద్యం షాప్‌లను డిసెంబర్ 1 నుండి ప్రారంభమైనవి. సోమవారం నుండి ప్రారంభమైన మద్యం షాప్‌లు ఎన్నికల కోడ్ అమలు ఉండడంతో ఎటువంటి ఆర్భాటం, అట్టహసంగా లేకుండా మద్యం దుకాణాలను సాదా సీదాగా యజమానులు ప్రారంభించుకున్నారు. ఈ సారి యైన మద్యం ప్రియులను నిరుత్సాహ పరుచకుండా వైన్సులలో వినియోగదారులకు కావలిసిన లిక్కర్ బ్రాండ్లను అందుబాటులో ఉంచాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. ఇందుకుగాను సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## అదుపుతప్పిన డిసిఎం ఢీ.... యువకుడు దుర్మరణం






ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: మండలకేంద్రంలో డీసీఎం డ్రైవర్ అజాగ్రత్త వల్ల ఒక యువకుడు బలైపోయిన సంఘటన చోటు చేసుకుంది. . పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ నుండి హైదరాబాద్ కు వెళుతున్న డీసీఎం ను డ్రైవర్ అజాగ్రత్తగా,అతి వేగంగా నడుపడంతో అదుపు తప్పి షాప్ లోకి దుసికెళ్ళుతు అక్కడే నిలబడి ఉన్న పట్టణనికి చెందిన గుంటూరు అభిరామ్‌ను ఢీ కొట్టడంతో బలమైన గాయాలు తగిలిన యువకున్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. డీసీఎం డ్రైవర్ కు స్వల్ప గాయలు తగిలయ యని తెలిపారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ క్రాంతికుమార్ తెలిపారు.

## ముమ్మరంగా నామినేషన్లు



ప్రజా పక్షం/హాలియా: గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దీనిలో భాగంగానే సాగర్ నియోజకవర్గంలో సోమవారం వివిధ గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు నామినేషన్లు ఊపొందుకున్నాయి. సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లతోపాటు ఆ గ్రామాల వార్డులకు కూడా పోటీ చేసేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. అనుముల మండలంలోని 24 గ్రామపంచాయతీలలో ఇప్పటివరకు 35 నామినేషన్లు సర్పంచ్ ప్రజలకు దాఖలు అయినట్లు తెలిసింది. సా యం త్రం పొద్దుపోయే వరకు అధికారులు నామినేషన్లను స్వీకరిస్తున్నా రు. మండలంలోని హాలియా మున్సిపాలిటీ నుండి విడిపో యి గ్రామ పంచాయతీగా ఏర్పడిన ఇబ్రహీంపేట గ్రామపంచాయతీకి సర్పంచ్ అభ్యర్థిగా ఎడవల్లి వంశీ కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

## మాటూరు బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా సత్యనారాయణ

ప్రజాపక్షం/మోటకొండూర్ :మోటకొండూర్ మండలంలోని మాటూరు బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా దడిగే సత్యనారాయణను ఆ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వార్డు సభ్యులుగా గనగాని నీలమ్మ, అంబాల నర్సింహులు, బండ్రు శ్రీను, అంబాల రమాదేవి, మాటూరు విజయ, మాటూరి సత్యనారాయణ, బైరపాక బాగ్య, రాములు, శంకర్, శ్రీనివాసు ఎంపిక చేసినట్లు ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల స్వామి తెలిపారు.

# ధన్యజీవి మేడా భూషయ్య

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**





**ప్రజాపక్షం/ఏన్కూరు :** ధన్యజీవి మేడా భూషయ్య అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏన్కూర్ మండల సీనియర్ నాయకులు అమరజీవి మేడా భూషయ్య సంస్మరణ సభ ఏన్కూర్ వారి స్వగృహం లో జరిగింది. ఈ సంతాప సభ సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు మాట్లాడుతూ, మేడా భూషయ్య భారత కమ్యూనిస్ట్ పార్టీ ని ఏ న్కూర్ గ్రామంలో పార్టీని పెంచడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ నీ గెలిపించడంలో వారి పాత్ర కీలకం అన్నారు. పార్టీకి గడ్డు పరిస్థితులు వచ్చిన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని అన్నారు. సీనియర్ నాయకులుగా పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేనివి అన్నారు. వారికి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సంతాప సభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపటి రమేశ్, జిల్లా నాయకులు తెప్పాల సత్యం, అమరణేని వీరభద్రమ్, చంద్ర నరేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, దొంతిబోయిన నాగేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు విజయ బాయి, టిడిపి నాయకులు తాళ్లూరి అప్పారావు, జనార్ధన్ మండలంలోని వివిధ పార్టీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ టూ తెలంగాణ వయా కట్టుకాచారం..!

**-భారీగా ధాన్యం అక్రమంగా తరలింపు**
**-బోనస్ కోసం ఏపీ నుంచి తెలంగాణకు..**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ సరిహద్దు గ్రామం, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం గ్రామంలో సోమవారం ఏపీ నుంచి సూర్యాపేట జిల్లా కు వస్తున్న 8 ధాన్యం లారీలను స్థానికులు అడ్డుకున్నారు. లారీ డ్రైవర్లు ను నిలదీయగా వారి వద్ద నకిలీ ట్రక్ షీట్స్ తో తెలంగాణ ప్రభుత్వం క్వింటా కు రూ.500 బోనస్ ను నొక్కేందుకు అక్రమానికి తెర లేపారు. ఏపీ నుంచి ప్రతీ సీజన్ లో వందల లారీల ధాన్యం ను తెలంగాణ కు తరలిస్తున్నారు. ఏపీ లోని బడా వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ లో తక్కువ ధరకు ధాన్యం ను కొనుగోలు చేసి తెలంగాణ లోని మద్దతు ధర తో పాటు, బోనస్ ను కూడ కొల్లగొడుతున్నారు. అక్రమార్కులకు అధికార యంత్రాంగం సహకరిస్తుందనే విమర్శలు వినవస్తున్నాయి. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా ఏపీ నుంచి ధాన్యం ను విక్రయించటం సాధ్యమా అని ప్రశ్నిస్తున్నారు. వందలాది లారీలను ఏపీ నుంచి తెలంగాణ కు వస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం కు తెలిసినప్పటికీ పట్టించుకోవటం లేదు. గతంలో నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం వద్ద దాదాపు 30 లారీలను స్థానికులు నిలిపివేశారు. కానీ అధికారులు పట్టుకుని వదిలేశారు. ఇదే అదునుగా భావించి ఈ ఏడాది కూడ ధాన్యం ను తరలిస్తున్నారు. దీని వలన కోట్ల రూపాయలు బోనస్ ను ఏపీ కి చెందిన బడా వ్యాపారులు దోచుకుంటున్నారు. ఏపీ కిచెందిన లారీలు ప్రతీ రోజు అక్రమంగా సరిహద్దు దాటుతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవటం లేదని...పైగా వారితో బేరాసారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సోమవారం 8 లారీలు సూర్యాపేట వెళ్తున్న విషయం ను తెలుసుకుని గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ విజయ్బాబు ఘటనా స్థలం కు చేరుకుని వివరాలు సేకరించారు. పంచనామా నిర్వహించి ధాన్యం లారీలను స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. కాగా ఏపీ నుంచి ఇంత పెద్ద ఎత్తున జిల్లాలోకి ప్రవేశిస్తుంటే, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవటం పై పలు విమర్శలు వినవస్తున్నాయి. ముదిగొండ మండలం లోని వల్లభి లో చెకోపోస్టు ఉండటం తో నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం మీదుగా సూర్యాపేట కు వెళ్లేందుకు అక్రమారులు మార్గం ను ఎంచుకున్నారు. నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం మీదుగా సూర్యాపేట కు వెళ్లేందుకు అక్రమారులు మార్గం ను ఎంచుకున్నారు. నేలకొండపల్లి మండలంలోని రాష్ట్ర సరిహద్దు లో నిఘా లేకపోవటంతో ఏపీ అక్రమార్కులకు రాజమార్గం గా మారింది. దీనికి తోడు గ్రామస్తులు సమాచారం ఇచ్చిన నిమ్మకునీరెత్తిన్నట్లు గా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరు పై స్థానికులు అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడ పట్టించామని..కానీ అధికారులు హడావుడి చేసి, చేతులు దులుపుకుంటున్నారు. మరుసటి రోజే అక్రమం దర్జాగా చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఏపీ నుంచి అక్రమ ధాన్యం ను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

# ఎన్నికల నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్న సిఎం

**-బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్**
**-ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యం**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల నిబంధనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిలోదకాలు ఇచ్చారని శాసన మండలి సభ్యులు, బిఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆరోపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉన్న సమయంలో జిల్లాల పర్యటన ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పర్యటన స్థానిక సంస్థల ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని పర్యటనలను నిలుపుదల చేయాలని ముఖ్యమంత్రి దిగజారుడు ప్రకటనలు చేయడం ద్వారా ఎన్నికల విలువలను దిగజారుస్తున్నారని ఆయన తెలిపారు. రెండేళ్లుగా ఖమ్మం జిల్లా అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రైతులు దగా పడుతున్నారని యూరియా కోసం పడిగాపులు కాశారని ఒక మాటలో చెప్పాలంటే రైతులను ఈ ప్రభుత్వం శత్రువులగా చూస్తుందని ఆయన అన్నారు. బిసిలకు తీరని అన్యాయం చేసిందని 22.2 శాతం చొప్పున బిసిలకు 127 గ్రామ పంచాయతీలు రావాలని కానీ 54 మాత్రమే వచ్చాయని ఇది కాంగ్రెస్ చేసిన ద్రోహమని ఆయన తెలిపారు. రైతులు, పేదలు, నిరుద్యోగులు, యువత ఇలా అందరిని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. త్వరలోనే ఈ దుర్మార్గపు పాలనకు తెరపడుతుందని ఆయన తెలపారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బిచ్చాల తిరుమలరావు, తాజుద్దీన్, శేషు, నరేందర్, మగ్బూల్, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా కొనసాగుతున్న నామినేషన్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలంలోని 21 గ్రామాలలో ఏడు క్లస్టర్లలో సర్పంచ్ వార్డు మెంబర్లకు పోటీ చేయు అభ్యర్థుల నామినేషన్ల పర్వం జోరుగా కొనసాగుతోంది. రెండవ రోజు ముగిసేసరికి మొత్తం సర్పంచుల అభ్యర్థుల సంఖ్య 52, వార్డుల అభ్యర్థుల సంఖ్య 147గా నమోదయినట్లు ఎండిఓ ఆర్.భాస్కర్ సోమవారం తెలిపారు. సర్పంచ్ అభ్యర్థికి గాను దేశ్ముఖి, శివారెడ్డి గూడెం గ్రామాలలో 6 చొప్పున ఇంద్రియాల గ్రామంలో 5, పెద్ద రావులపల్లిలో 4, జూలూరు భీమనపల్లి దోతిగూడెం గ్రామాలలో 3 చొప్పున, కప్రాయి పల్లి, వంకమామిడి, జుబ్లక్పల్లిలో 1 చొప్పున, మిగిలిన గ్రామాలలో రెండు చొప్పున నామినేషన్లు వేశారు. అభ్యర్థుల నామినేషన్లకు నేడు ఆఖరి తేదీ కావడంతో పెద్ద ఎత్తున అన్ని రాజకీయ పార్టీల నుండి నామినేషన్లు పర్వం కొనసాగనుంది. కొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల రెబల్ లీడర్స్ తలపోటుగా మారి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగుతుండడం గమనార్హం.

## భూనిర్వాసితులకు అండగా ఉంటా



**ప్రజాపక్షం/భువనగిరి :** బీఎన్ తిమ్మాపురం భూనిర్వాసితులకు అండగా ఉంటానని ఎడ్ల వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి మండలంలోని బిఎన్ తిమ్మాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎడ్ల వెంకట్ రెడ్డి వడపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎన్ తిమ్మాపురం భూనిర్వాసితులకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోటకొండూర్ మాజీ సర్పంచ్ శ్రీలత బిఆర్ఎస్‌లో చేరిక

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత శ్రీనివాస్ మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. గొంగిడి మహేందర్ రెడ్డి బిఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. కాగా వడ్డెబోయిన శ్రీలత శ్రీనివాస్ గతంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది గత 5 సంవత్సరాలుగా సర్పంచ్‌గా కొనసాగారు. మళ్ళీ రెండవ సారి సర్పంచ్ బరిలో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉంటున్నట్లు మహేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బోట్ల యాదయ్య, మదర్ డైరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పల్ల వెంక రెడ్డి, మాజీ డైరెక్టర్ అనంతుల జంగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూమండ్ల యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ బొట్ల నరసింహ, కో ఆప్షన్ ఎండి బురాన్, సీనియర్ నాయకులు సిరబోయిన నర్సింగ్ యాదవ్, బొలగని లక్ష్మీనారాయణ గౌడ్, బొట్ల శీను యువజన నాయకులు జివిలికపల్లి వెంకటేష్, నల్ల జాంగిర్, బోట్ల కృష్ణ, వంగగపల్లి నరేష్, కొల్లూరు నరేష్, కొల్లూరు రాజు, వంగపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి తాడూరు లలిత లింగస్వామి

**ప్రజాపక్షం/వలిగొండ :** మీ ఊరి బిడ్డను నన్ను ఆశీర్వదించి గెలిపించాలని వలిగొండ మండలం సంగం గ్రామం బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తాడూరు లలిత లింగస్వామి అన్నారు. సోమవారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా మాట్లాడుతూ తాను గ్రామానికి మీకు సేవకురాలుగా పనిచేస్తానని మన గ్రామ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీసరి రాంరెడ్డి, బద్దం రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కాసుల కృష్ణ, వరికుప్పల మల్లేశం పాల్గొన్నారు.

## రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు : ఎస్ఐ

**ప్రజాపక్షం/కల్లూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెచ్చగొట్టే పోస్టులుపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిత హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోఉన్నందున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏదైనా ఇతరులకు హాని కలిగించే పోస్టులు షేర్ చేసిన నేరంగా పరిగణించి గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యులనుగా చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనుక సోషల్ మీడియా లో ప్రచారం చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు.

## 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన 10 మంది అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి 10 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు చాలా కీలకమని వీటిని సరిగ్గా నిర్వహించేందుకు సిబ్బందిని సన్నద్ధం చేసేందుకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తే వాటికి హాజరు కాని 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.